జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 9 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7



# డ్రైనేజీల పై అక్రమ దుకాణాలు
## పట్టించుకోని పంచాయతీ అధికారులు

- వర్షాకాలంలో నీటి పారుదల దెబ్బ తింటుందనే స్థానికుల ఆందోళన
- గతంలో నోటీసులు జారీ ఫలితం మాత్రం శూన్యం



**అశ్వాపురం, ఆగస్టు 8, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలం లోని గ్రామంలో రహదారుల విస్తరణ పేరుతో డ్రైనేజీలపై అక్రమంగా దుకాణాలు, షెడ్లు మరియు

మిగతా 2 లో...



# అడవే ఆస్తి.. సంస్కృతే శ్వాస..!

7 లో..

- అడవే ఆస్తి.. సంస్కృతే శ్వాస..!
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం
- అడవితో బతుకు.. ప్రకృతితో అనుబంధం
- తరతరాల జ్ఞానమే ఆదివాసీ సమాజానికి అసలైన సంపద
- అభివృద్ధి అడుగులు పడుతున్నా.. కొన్ని గూడాలకు అందని కనీస సదుపాయాలు
- కొత్త తరం కొత్త ప్రపంచంలోకి.. మూలాలను కాపాడుకోవడమే సవాల్
- భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే అస్తిత్వానికి పునాది
- ఆదివాసీ మహిళల చేతుల్లో ఆరోగ్య, జీవన జ్ఞాన వారసత్వం
- "మంత్రసానుల సంప్రదాయ జ్ఞానానికి గౌరవం.. జీవితం, శ్రేయస్సు పరిరక్షణే" 2026 ఐక్యరాజ్యసమితి అంశం

# విద్య, వైద్యంలో నిర్లక్ష్యం సహించేది లేదు



- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- ములకలపల్లి కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాల, పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు
- గురువుగా మారి విద్యార్థినులకు పాఠాలు బోధించిన ఎమ్మెల్యే

**ములకలపల్లి, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి):** మండలంలో అశ్వారావు పేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం విస్తృతంగా పర్యటించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల–కళాశాల, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ముందుగా కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థినులతో ముచ్చటించారు. వారి చదువు, విద్యా ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం స్వయంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. చదువుపై ఆసక్తి పెంచుకుని

మిగతా 2 లో...

# అధ్వాన్నంగా సీతారామపురం రహదారి

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మొండికుంట నుంచి సాంబాయిగూడెం వరకు గుంతలమయంగా మారిన రోడ్డు..
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందన కరువు



**అశ్వాపురం, ఆగస్టు 8, ప్రజాజ్యోతి** అశ్వాపురం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని సీతారామపురం, పరిసర

మిగతా 2 లో...

- సమాజ భద్రతే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వినూత్న కార్యక్రమాలు
- నేరాల నియంత్రణలో కొత్త తరహా పోలీసింగ్‌కు శ్రీకారం
- గంజాయి నిర్మూలనకు 'చైతన్యం'.. మహిళలు, బాలికల భద్రతకు 'పోలీస్ అక్క'
- కేసులు, దర్యాప్తులకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు పోలీసింగ్
- అవగాహనతో సమస్యల నివారణ.. భరోసాతో బాధితులకు అండ
- యువత భవిష్యత్తుకు దిశ.. మహిళలకు ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యం
- నేరం జరిగిన తర్వాత చర్య కంటే.. ముందస్తు నివారణకు ప్రాధాన్యం




6 లో..

# యువతకు చైతన్యం... మహిళలకు పోలీస్ అక్క..!

## డ్రైనేజీ ల పై అక్రమ దుకాణాలు....

(మొదటి పేజీ తరువాయి...)




ఇతర తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేయడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. డ్రైనేజీలను పూర్తిగా ఆక్రమించడం వల్ల వర్షపు నీరు సక్రమంగా వెళ్లే మార్గం లేక ఇళ్ల ముందు, రోడ్లపై నీరు నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి డ్రైనేజీలను స్వేచ్ఛగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ ఆక్రమణల కారణంగా మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన, దోమల సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రజారోగ్యానికి కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మరింత విషమించకముందే పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలపై ఉన్న అక్రమ దుకాణాలు, నిర్మాణాలను తొలగించి నీటి పారుదల వ్యవస్థను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్య, వైద్యంలో నిర్లక్ష్యం సహించేది లేదు





(మొదటి పేజీ తరువాయి...)

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎమ్మెల్యే స్వయంగా పాఠాలు బోధించడంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల–కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి మెస్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ, పరిశుభ్రతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. భోజన నాణ్యతలో లోపాలు తలెత్తితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తదుపరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నీరుగార్చకుండా అధికారులు,సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, సేవాదళ్ నాయకులు తిరుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సుమిత్, వంశీతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 8,(ప్రజాజ్యోతి)** వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలోని నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెసర, మినుము, కంది, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రాంతానుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, తక్కువ నీటి వినియోగం, పంటల వైవిధ్యీకరణ, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునే విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రాధాన్యతను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. చెరువులు,బోర్‌వెల్స్‌పై అధికంగా ఆధారపడి వరి సాగు చేయడాన్ని నిరుత్సాహపరుస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైజ్డ్ బెడ్ విధానం, నీటి సంరక్షణ, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, నేలలో తేమను సంరక్షించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 1,38,198 ఎకరాలను ప్రత్యామ్నాయ పంటల పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అన్ని క్లస్టర్లలో పెసర, మినుము, కంది వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. సాగునీటి ఆధారిత మొక్కజొన్న, పత్తి, వరి ప్రాంతాల్లో పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, తాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచి పంట నష్టాల ప్రమాదాన్ని తగ్గించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత, సాగునీటి వినియోగంలో సమర్థత, పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయ పరిరక్షణ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశం లో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇరిగేషన్ ఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సిపిఓ సునీత, మిషన్ భగీరథ ఈఈ లు నలిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ ఈ ఈ లు,డీఈలు వ్యవసాయ శాఖ ఏడీలు,ఏవోలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా సీతారామపురం రహదారి

(మొదటి పేజీ తరువాయి...)

గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి రహదారి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు మారుతున్నా..

తమ రహదారి పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మొండికుంట నుంచి సీతారామపురం–1, సీతారామపురం–2, గొల్లగూడెం సమీపంలోని సీతారామ ప్రాజెక్టు ప్రాంతం, మంచికంటి నగర్ మీదుగా మణుగూరు సాంబాయిగూడెం వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రస్తుతం పూర్తిగా గుంతలమయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. పలుచోట్ల రహదారి దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారి

రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గతంలో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి ఎక్కడ బాగుంది, ఎక్కడ గుంత ఉందో వాహనదారులకు అర్థం కాని పరిస్థితి నెలకొంటోంది. దీంతో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఈ రహదారిపై ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, వ్యాపారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు వాహనాలు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే రోగులు, గర్భిణులు, వృద్ధులు కూడా ఈ రహదారి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు కూడా వేగంగా ప్రయాణించలేని పరిస్థితి నెలకొంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా?

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రహదారి సమస్యను అధికారులు ఇప్పటికైనా తీవ్రంగా పరిగణించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇతర అభివృద్ధి పనులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ ప్రజల నిత్య ప్రయాణానికి కీలకమైన ఈ రహదారి విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి.

సీతారామపురం, సీతారామపురం–1, సీతారామపురం–2, గొల్లగూడెం, మంచికంటినగర్, మణుగూరు సాంబాయిగూడెం ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే రహదారిని పరిశీలించాలని కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన ప్రాంతాలను గుర్తించి తక్షణ మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైతే రహదారి పూర్తిస్థాయి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం అధికార యంత్రాంగం ప్రధాన బాధ్యత అని, ఈ విషయంలో ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజలు, యువత, ప్రజా సంఘాలు కలిసి ఈ సమస్యపై విస్తృతంగా స్పందించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు మారుతున్నా.. మా రహదారి పరిస్థితి మాత్రం మారడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలి” అని సీతారామపురం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పాల్వంచ ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకుంటాం

- పాల్వంచలో సర్వే నెంబర్ల సమస్యకు త్వరలో పరిష్కారం
- విద్యుత్ ప్లాంట్లు, స్పాంజ్ ఐరన్ కర్మాగారం సాధించేవరకు విశ్రమించం
- కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను అడ్డుకుంటాం
- అటవీహక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టానికి భంగం కలిగిస్తే సహించేది లేదు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా






**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ/ ఆగస్టు 8,(ప్రజాజ్యోతి)** పాల్వంచ ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు, ఈ ప్రాంత జనసమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. 'బద్లావ్ జరూరి హై' నినాదంతో సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు మూడోరోజు పాల్వంచ మండలం, పాల్వంచ అర్బన్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో పర్యటించింది, పినపాక పట్టణగర్ మీదుగా కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ రూరల్ మండలంలో రంగాపురం గ్రామానికి ప్రవేశించిన చైతన్య యాత్ర బృందానికి పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టణ పరిధిలో భద్రాచలం రోడ్ నుండి బస్టాండ్ మీదగా రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్, శాస్త్రి రోడ్డు వరకు భారీ ద్విచక్ర వాహనాల ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణంలోని శాస్త్రిబొమ్మ వద్ద జరిగిన బహిరంగ సభలో ఎస్.కె సాబీర్పాషా మాట్లాడుతూ.. పాల్వంచ పట్టణంలోని సర్వే నెంబర్లు 444, 999, 817, 727, 410లలోని స్థలాలను క్రమబద్దీకరించాలని సుదీర్ఘ కాలంగా సిపిఐ పోరాటాలు నిర్వహించడంతోపాటు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధ, కృషితో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించబోతోందని, అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను ప్రారంభించారని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం వేగంగా సర్వే పూర్తి చేసి అర్హులందరికీ పట్టాలు అందించాలని కోరారు. అదే విధంగా పాల్వంచ కేటీపీఎస్ పరిధిలో 800x2 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రాలను తక్షణమే నిర్మించాలని, మూతపడిన స్పాంజి ఉక్కు కర్మాగారాన్ని పునప్రారంభించి పాల్వంచకు పూర్వవైభవం తెచ్చేదుంకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేసుకుంటున్న పెండింగ్ పోడు భూములకు వెంటనే పట్టాలు అందజేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని ఈ చట్టాలని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను పోరాటాల ద్వారా తిప్పికొడతామన్నారు. ఏజెన్సీ ప్రాంతాలతో మిళితమైన భద్రాద్రి జిల్లా సమగ్ర వికాసంపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి అదానీ, అంబానీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగాన్ని తెగనమ్ముతూ మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని మండిపడ్డారు. కేంద్రం తీరును నిరసిస్తూ సిపిఐ చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలకు ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, ఇదే స్పూర్తితో సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టి కేంద్రానికి వణుకుపుట్టిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మేయర్ మూడ్ గణేష్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సర్ రెడ్డి పుల్లారెడ్డి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మున్నా లక్ష్మీకుమారి, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్.కె ఫహీం, మువ్వ వెంకటేశ్వర్లు, భూక్యా దసురు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం, వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, భూక్యా శ్రీనివాస్, వీ పద్మజ, రత్నకుమారి సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్చిరెడ్డిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నూతన కమిటీ ఏర్పాటు



**పినపాక,ఆగష్టు 08(ప్రజాజ్యోతి )** పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొప్పుల వీరస్వామి ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా ములకలపల్లి విష్ణు, కంటెం భాస్కర్, ఎట్టి శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులుగా అడపాల వెంకటయ్య, కాళ్ల లక్ష్మణ్, కొప్పుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కొప్పుల కళ్యాణ్, సత్రపల్లి పొట్టయ్య, ఎట్టి అచ్చమ్మ, గోసుల సమత, మడిపల్లి మణికంఠ, ప్రధాన కార్యదర్శులుగా ఇసంపల్లి జంపయ్య, చిన్ని సర్వేష్, కోర్స స్వరూప, కునపురెడ్డి సంధ్య, కాళ్ల నరసింహరావులను ఎంపిక చేశారు.కార్యనిర్వహణ సభ్యుడిగా ఎట్టి సర్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా వంకాయల జంపన్న, సత్రపల్లి సాగర్, చల్ల ప్రశాంత్, కొప్పుల సాయిబాబులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణ (సర్) కు సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్: పాల్వంచ / ఆగస్టు 8,(ప్రజా జ్యోతి )** ఓటర్ల జాబితా సవరణ (సర్ ) కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు డీ.సీ.ఎం.ఎస మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బి.ఎల్.ఎ సూపర్ వైజర్లతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్ పి.సి.సి. కో–ఆర్డినేటర్ మానసపల్లి లింగోజి, కొత్తగూడెం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆళ్ల మురళీ లతో కలిసి కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓట్ల నమోదు అయ్యేలా కృషి చేశారని అన్నారు. ఓటర్ల నమోదు లో బీ.ఎల్.ఓ లు, కాంగ్రెస్ పార్టీ బీ.ఎల్.ఏ లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్యపరిచారన్నారు. సర్ కార్యక్రమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలకు, అధినాయకత్వానికి కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు ,ఈ కార్యక్రమంలో లింగోజి, ఆళ్లమురళీ, కొత్వాల తో పాటు కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, నూకల రంగారావు, గంగరెడ్డి భువన సురేందర్ రెడ్డి, వాసు మల్ల సుందర్ రావు, గుర్రం వెంకటరత్నం, ఉండేటి శాంతివర్ధన్, గుండు రవి, వాలపల్లి రాంబాబు, సందు ప్రభాకర్, భట్టు మురళి, బత్తుల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, దుస్తుల పంపిణీ చేసిన దండు సారయ్య







**ఇల్లందు, ఆగస్ట్ 8 (ప్రజా జ్యోతి)** ఆర్అండ్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య చిన్నారులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చిన్నవయసు నుంచే పిల్లల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారికి అవసరమైన ప్రాథమిక వస్తువులను అందించడం ద్వారా వారిని ప్రోత్సహించవచ్చని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వు చూడటం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా పిల్లల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక మహిళలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**బూర్గంపహాడ్, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలం సారపాక గోదావరి బ్రిడ్జి వద్ద శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...సారపాక–భద్రాచలం వంతెన కింద మూడో పిల్లర్ వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో గజ ఈతగాడు ప్రసాద్ సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడికి 40నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, బూడిద రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహానికి సంబంధించిన ఆచూకీ, వివరాలు తెలిస్తే 8712682055, 8712682057 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## జానంపేటలో ఇసుక లారీ, బైక్ ఢీ?

- ముగ్గురికి గాయాలు






**పినపాక,ఆగష్టు 08(ప్రజాజ్యోతి)**పినపాక మండలం జానంపేటలో ఇసుక లారీ, బైక్ ఢీ కొన్నట్టు సమాచారం. జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఈ ప్రమాదంలో గాయపడగా, గాయపడిన వారిని 108ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డవారు గడ్డిగూడెం గ్రామానికి చెందిన కొరస నర్సింహారావు, జానంపేట పీహెచ్‌సీలో నర్స్‌గా పనిచేస్తున్న కొరస హిమవతి, గడ్డిగూడెం గ్రామానికి చెందిన మద్దెల రాణి గా స్థానికులు తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు సహా యం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సం ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు,తెలియాల్సి ఉంది.

## ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కుంజా వెంకటేష్ దొర



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి ):**ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి మండల ఆదివాసీ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర ఆదివాసీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల హక్కులు, వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు వారి జీవన విధానాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ఆదివాసీ సమాజాల పట్ల ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ అడవులు, పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా తమ ప్రత్యేక సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను కొనసాగిస్తున్న ఆదివాసీ సమాజాలు నేడు ప్రపంచీకరణ ప్రభావంతో అనేక మార్పులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి జీవనోపాధి, విద్య, వైద్యం తదితర రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందేలా ప్రభుత్వాలు, ప్రజలు కలిసి కృషి చేయాలని కోరారు.ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రపంచంలోని 90 దేశాల్లో సుమారు 47.6 కోట్ల మంది ఆదివాసీలు నివసిస్తున్నారని తెలిపారు. ప్రపంచ జనాభాలో వారు ఆరు శాతం కంటే తక్కువగా ఉన్నప్పటికీ, 5 వేలకు పైగా విభిన్న తెగలు, సమూహాలు ఉన్నాయని వివరించారు. ప్రపంచంలోని మారుమూల అరణ్య ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక ఆదివాసీ తెగలు తమ సాంప్రదాయ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నాయని అన్నారు.భారతదేశంలో 705 గిరిజన తెగలు ఉన్నాయని, దేశ జనాభాలో వారి వాటా సుమారు 9 శాతం ఉంటుందని తెలిపారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సామాజిక పరిస్థితులపై పలువురు మానవ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారని పేర్కొన్నారు.చారిత్రక నేపథ్యంఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి 1982 ఆగస్టు 9న జెనీవాలో తొలిసారిగా సమావేశాన్ని నిర్వహించిందన్నారు. అనంతరం 1994 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం మేరకు ప్రతి ఏడాది ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల హక్కులు, గౌరవం, సంస్కృతి,సంప్రదాయాల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కుంజా వెంకటేష్ దొర కోరారు.

# ఐటీసీ గేటు వద్ద గుగులోత్ శ్రీరామ్ కుటుంబం నిరసన

- న్యాయం జరిగే వరకు కదిలేది లేదని హెచ్చరిక






**బూర్గంపహాడ్, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారం గేటు వద్ద శ్రీరామ్ కుటుంబ సభ్యులు మృతదేహంతో చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ప్రధాన రహదారిపైకి వస్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో గూగులోత్ శ్రీరామ్(50) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు.. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని కర్మాగారం గేటు నుంచి తరలించేది లేదని స్పష్టం చేస్తూ శనివారం ఆందోళనకు దిగారు.

### »» మృతదేహంతో బైఠాయింపు....

శ్రీరామ్ మృతదేహాన్ని ఐటీసీ పీఎస్పీడీ ప్రధాన గేటు వద్ద ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేపట్టారు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు, బంధువుల ఆవేదనతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. శ్రీరామ్ మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, తమ పరిస్థితిని అర్థం చేసుకుని ఐటీసీ యాజమాన్యం వెంటనే స్పందించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.కాగా కర్మాగారంలో విధులు ముగించుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే ఐటీసీకి సమీపంలోని ప్రధాన రహదారిపై ప్రమాదం జరిగిందని, మృతి చెందిన శ్రీరామ్ కుటుంబానికి యాజమాన్యం తగిన భరోసా కల్పించాలని కోరారు.

### »» అగ్రిమెంట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్....

తమ కుటుంబానికి అగ్రిమెంట్ ప్రకారం రావాల్సిన పరిహారం, ఇతర ప్రయోజనాలపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శ్రీరామ్ మరణంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడిందని, భవిష్యత్తులో కుటుంబాన్ని ఆదుకునే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

### »» గతంలో న్యాయం చేశారు.. మాపై ఎందుకు చిన్న చూపు?''....

గతంలో కర్మాగార పరిధిలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు యాజమాన్యం న్యాయం చేసిన సందర్భాలు ఉన్నాయని, అదే విధంగా తమ కుటుంబానికి కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.''గతంలో ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేశారు. మాకు ఎందుకు చేయరు?'' అంటూ వారు ప్రశ్నించారు. తమ కుటుంబం పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి తగిన పరిహారం అందించాలని కోరారు.

### »» న్యాయం జరిగే వరకు కదిలేది లేదు....

తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని కుటుంబ సభ్యులు తేల్చిచెప్పారు. మృతదేహాన్ని గేటు వద్ద ఉంచి ఆందోళన కొనసాగిస్తామని, న్యాయం జరిగేంత వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు.యాజమాన్యం వెంటనే చర్చలు జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా ఆందోళనను విరమించమని చెప్పడం సాధ్యం కాదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

### »» కుటుంబానికి సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్

### సంఘీభావం....

శ్రీరామ్ కుటుంబ సభ్యులు చేపట్టిన ధర్నాకు సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి కిషోర్ శివరాం నాయక్ సంఘీభావం తెలిపారు. ఐటీసీ గేటు వద్ద ఉంచిన శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు చేస్తున్న న్యాయపరమైన డిమాండ్లకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. శ్రీరామ్ కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఐటీసీ యాజమాన్యం మానవతా దృక్పథంతో స్పందించాలని, కుటుంబానికి తగిన పరిహారం అందించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.

### »» ఉద్రిక్తంగా మారిన ఐటీసీ గేటు పరిసరాలు...

మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఐటీసీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళన కొనసాగించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఒకవైపు శ్రీరామ్ కుటుంబ సభ్యుల ఆవేదన,మరోవైపు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని తెలిపారు. శ్రీరామ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్నా కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి పరిహారం, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించే అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.శ్రీరామ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కుటుంబ సభ్యులు, బంధువులు తేల్చిచెప్పారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

**ఇల్లందు, ఆగస్ట్ 8 (ప్రజా జ్యోతి )** ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో నేడు జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆదివాసి సంఘ నాయకులు ముక్తి కృష్ణ, అరేం కిరణ్, పూనెం సురేందర్, పాయం స్వాతి, పాయం కృష్ణ ప్రసాద్, కల్తీ పద్మ లు కోరారు. శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు ఉదయం 8 గంటలకు గోవింద్ సెంటర్ వద్ద ఆదివాసీ వాయిద్య కళాకారులు, సాంప్రదాయ కొమ్ము డ్యాన్స్ బృందాల ప్రదర్శనలతో భారీ ర్యాలీ ప్రారంభం కానుందన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వివిధ కళారూపాలతో పట్టణ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగుతుందన్నారు.ఉదయం 9 గంటలకు ఇల్లందు కొత్త బస్టాండ్ వద్ద గల ఆదివాసీల ఆరాధ్య నాయకుడు కొమరం భీమ్ విగ్రహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. కొత్త బస్టాండ్ నుండి జెకె కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి భారీ బహిరంగ సభ నిర్వహించబడుతుందని తెలిపారు. సభలో ఆదివాసీల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా, ఉపాధి అవకాశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసి ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, యువత, మహిళలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం




**ఇల్లందు, ఆగస్ట్ 8 (ప్రజా జ్యోతి )** ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల దీవెనలతో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుడికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5, 21వ వార్డు కౌన్సిలర్లు చిల్లా విజయభారతి, నీలాపు రమేష్, మున్సిపల్ కో ఆప్షన్స్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, నాయకులు చిల్లా శ్రీనివాస్, మేకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మన్ననగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం









- **గిరిజన చిన్నారులకు మెరుగైన వసతులు: ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

**ములకలపల్లి, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి):** మండలంలోని ధర్మన్ననగర్ వలస ఆదివాసీ గ్రామంలో డైనాటా సంస్థ సీఎస్ఆర్ నిధులతో సమారిటన్స్–ఫర్ ది నేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటెయినర్ ఆధారిత అంగన్‌వాడీ కేంద్రాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వందన గౌడ్, డైనాటా ఎన్జీవో సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. తల్లిపాల వారోత్సవం నిర్వహించి లబ్ధిదారులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల చిన్నారులకు విద్య, పౌష్టికాహారం, సంరక్షణ అందించడమే లక్ష్యమన్నారు. కేంద్రం ఏర్పాటుకు సహకరించిన డైనాటా సంస్థ, సమారిటన్స్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా రవి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎండి సాదిక్ పాషా, కొత్తపల్లి అంబేద్కర్, సుమిత్రా దేవి, ఎంపిడిఓ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, మాజీ సర్పంచ్ కారం సుధీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు సుమిత్, వంశీ, సేవాదళ్ నాయకుడు తిరుపతి రెడ్డి, పీడీ, సీడీపీఓ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

- **సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్**




**బూర్గంపహాడ్, ఆగస్టు 8 (ప్రజా జ్యోతి):** మతోన్మాదుల నుంచి భారతదేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రేపాలకు శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీపురంలో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై సీనియర్ నాయకులు ఎస్కె జానిమియాతో కలిసి జెండా ఆవిష్కరించారు. మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రేపాకుల మతోన్మాదం ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై బోధించారు. దేశం విభిన్న సంస్కృతులకు నిలయమని, అన్నిరకాల సంస్కృతులు కలగలిపిన దేశాన్ని పాలించడం కోసం భారత రాజ్యాంగం అనేక హక్కులు కల్పించిందన్నారు. నేటి పాలకులు భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే పద్ధతులు అవలంభిస్తుందని, బీజేపీ దేశ లౌకిక విధానానికి తిలోదకాలిచ్చిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లయినా జీరో అకౌంట్ జీరోలోనే ఉందని, ఏడాదికి కోటి ఉద్యోగాల ఊసే లేదని ఫలితంగా దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందన్నారు. ఉక్కు క్రమశిక్షణ కలిగిన సీపీఎం పార్టీని గ్రామగ్రామాన పటిష్టంగా నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. నీతి, నిజాయితీతో ప్రజాసమస్యలపై పోరాడే పార్టీ సీపీఎం అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు గడ్డం స్వామి, మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, ఎస్కో. అబీద, పాపినేని సరోజిని, రాయల వెంకటేశ్వర్లు, కనకం వెంకటేశ్వర్లు, గుంటక కృష్ణ, సయ్యద్ హుస్సేన్, కమటం మరియమ్మ, మడకం లత, టేకులచెరువు సర్పంచ్ బోళ్ల సైదమ్మ పాల్గొన్నారు.

# నేడు ఆదివాసి గిరిజన దినోత్సవ సభను విజయవంతం చేయాలి

- **ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుశా నాయక్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 8,(ప్రజా జ్యోతి)** ఆదివారం కొత్తగూడెం క్లబ్లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవ సభను విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశా నాయక్ పిలుపునిచ్చారు, 9న కొత్తగూడెం లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరుతూ కుశ నాయక్ ఆధ్వర్యంలో శనివారం పాల్వంచ మండలంలోని పలు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం క్లబ్బులో జరిగే సభకు లంబాడా యువత ,రైతులు, విద్యార్థిసంఘ నాయకులు, ఉద్యోగస్తులు, ఉద్యోగ సంఘ నాయకులు , అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు, ఈ సభలో ముఖ్యంగాగిరిజన హక్కుల పరిరక్షణకైతండా గ్రామపంచాయతీలను – రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి, తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని, ఎస్టీలు లు సాగు చేస్తున్నలావణి, సీలింగ్, పోడు భూములకు శాశ్వతంగా పూర్తి హక్కులతో అసెంబ్లీలో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలని, రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100% శాతం రిజర్వేషన్ ఎస్టి లకు రాష్టంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు, అదేవిధంగాకేంద్ర ప్రభుత్వం ఎస్టీల రిజర్వేషన్ను 7.5% శాతంను పెరిగిన జనాభా ఆధారంగా 14% కి పెంచాలని, ఎస్టి లంబాడీ గోర్బోలి భాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్లో చేర్చాలని, ఎస్టి ల 10% రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాల నీ, దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఎస్టి జాబితాలో చేర్చాలనిపై అంశాలపై కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వొత్తిడి చేసి, పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడి పరిష్కార దిశగా కాంగ్రెస్ హైకమాండ్ కృషి చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినోద్ నాయక్ జగదీష్‌నాయక్ ,సంతోష్‌నాయక్ హీరా లాల్ నాయక్ ,లాల్ సింగ్ నాయక్ మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్ ,మహిళలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్: వై. వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం కలెక్టరేట్ : పాల్వంచ /ఆగస్టు 8,(ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ , టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, పాల్వంచ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. వెంకటేశ్వర్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, శనివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవి మాట్లాడుతూఈ సందర్భంగా సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని డీజీపీ శ్రీ సీవీ ఆనంద్‌ను వై. వెంకటేశ్వర్లు ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు, దేశవ్యాప్తంగా పలువురు సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నమెంట్ ద్వారా కొత్తగూడెం జిల్లా, పాల్వంచ ప్రాంతాల్లో టెన్నిస్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.అలాగే జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధి, యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, వారికి మెరుగైన శిక్షణ , క్రీడా సదుపాయాలు కల్పించడం వంటి అంశాల పై కూడా చర్చించారు.సెప్టెంబర్ 16–22 తేదీల్లో జరిగే ఈ ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌కు డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆహ్వానించడం పట్ల భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, టెన్నిస్ అసోసియేషన్, పాల్వంచ టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉద్యమకారుడు పప్పు సుబ్బారావు సేవలో చిరస్మరణీయం

- **డి.సి.ఏం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 8,(ప్రజా జ్యోతి)** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశల ఉద్యమాలు చేసి చురుకైన పాత్ర వహించిన ఉద్యమకారుడు పప్పు సుబ్బారావు తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అని డి.సి.ఏం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఉద్యమనేత పప్పు సుబ్బారావు అనారోగ్యంతో ఇటీవల మరణించగా శనివారం పాల్వంచ మున్సిపల్ 7వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరహిల్స్ కాలనీలోని ఆయన గృహంలో దశదినకర్మ, సంతాప సభ నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధన కోసం సుబ్బారావు నిత్యం తన మిత్రులతో కలిసి చురుకుగా పాల్గొన్నారన్నారు. ఆయన మృతి తీరని లోటు అని,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు ,ఈ కార్యక్రమంలో కళాకారుడు సిద్దెల హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్ రావు, వాలపల్లి రాంబాబు, డోలి శ్రీను, బెతంశెట్టి వెంకట్, బోగిని సందీప్, సాగర్, నిమ్మల పురుషోత్తం, పుంజల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- సమాజ భద్రతే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వినూత్న కార్యక్రమాలు
- నేరాల నియంత్రణలో కొత్త తరహా పోలీసింగ్‌కు శ్రీకారం
- గంజాయి నిర్మూలనకు 'చైతన్యం'.. మహిళలు, బాలికల భద్రతకు 'పోలీస్ అక్క'
- కేసులు, దర్యాప్తులకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు పోలీసింగ్
- అవగాహనతో సమస్యల నివారణ.. భరోసాతో బాధితులకు అండ
- యువత భవిష్యత్తుకు దిశ.. మహిళలకు ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యం
- నేరం జరిగిన తర్వాత చర్య కంటే.. ముందస్తు నివారణకు ప్రాధాన్యం




# యువతకు చైతన్యం... మహిళలకు పోలీస్ అక్క..!

**నేరం జరిగిన తర్వాత కేసు నమోదు చేయడం, నిందితులను పట్టుకోవడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతే. అయితే నేరాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, వాటిని నివారించే దిశగా ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా ఆధునిక పోలీసింగ్ లో కీలక భాగంగా మారుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు యంత్రాంగం ఇదే ఆలోచనతో కేవలం చట్ట అమలు సంస్థగా కాకుండా, సమాజంతో మమేకమై సమస్యల నివారణకు పనిచేసే వ్యవస్థగా అడుగులు వేస్తోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడుతున్న యువతను అప్రమత్తం చేసి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు 'చైతన్యం', మహిళలు, బాలికల భద్రతకు అండగా నిలిచి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు 'పోలీస్ అక్క' కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది. ఈ రెండు కార్యక్రమాల వెనుక నేర నియంత్రణతో పాటు సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇచ్చే జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆలోచనా విధానం, కార్యాచరణలో ప్రత్యేక ముద్ర కనిపిస్తోంది.**

**- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజా జ్యోతి**

**గంజాయి మహమ్మారిపై సామాజిక ఉద్యమంగా 'చైతన్యం'**

గంజాయి వినియోగం ఒక వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాకుండా కుటుంబాలను, యువత భవిష్యత్తును, సామాజిక శాంతిభద్రతలను ప్రభావితం చేసే సమస్యగా మారుతోంది. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు ఈ అలవాట్లకు బానిసవుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం దాడులు, అరెస్టులు, కేసులతోనే సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం దొరకదనే ఆలోచనతో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే 2025 అక్టోబర్ 15న 'చైతన్యం – డ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, కౌన్సెలింగ్, ర్యాలీలతో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక, కుటుంబపరమైన దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువతలో బాధ్యతాయుతమైన ఆలోచన పెంపొందించడం, తల్లిదండ్రుల్లో అప్రమత్తత కల్పించడం, సమాజాన్ని భాగస్వామిగా మార్చడం ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి. నేరం జరిగాక స్పందించడం కంటే, నేరానికి దారితీసే పరిస్థితులను ముందుగానే అడ్డుకోవాలనే పోలీసింగ్ తత్వాన్ని 'చైతన్యం' ప్రతిబింబించింది.

**మహిళలకు అండగా 'పోలీస్ అక్క'**

సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపులు, భయాందోళనలు, మానసిక ఒత్తిళ్లు, కుటుంబ లేదా సామాజిక కారణాలతో బయటకు చెప్పలేని సమస్యలు అనేకం ఉంటాయి. చాలా సందర్భాల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలనే ఆలోచనే కొందరిలో సంకోచాన్ని కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో మహిళలు, బాలికల భద్రతను మరింత బలోపేతం చేయడం, వారికి పోలీసు వ్యవస్థపై భరోసా కల్పించడం లక్ష్యంగా గత నెలలో జిల్లాలో 'పోలీస్ అక్క' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా పోలీసులను ఇందులో భాగస్వామ్యం చేస్తూ సమస్యలను నేరుగా తెలుసుకోవడం, అవసరమైన సహాయం అందించడం, భద్రతపై అవగాహన కల్పించడంపై దృష్టి సారిస్తున్నారు. మహిళా పోలీసు సిబ్బంది మహిళలు, బాలికలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరించడం, అవసరమైనప్పుడు పోలీసు సహాయం అందుబాటులో ఉంటుందనే భరోసా కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో మహిళలతో నేరుగా మమేకమై విశ్వాసాన్ని పెంచే ప్రయత్నం ఈ కార్యక్రమంలో కనిపిస్తోంది.

**ప్రజల భాగస్వామ్యమే విజయానికి పునాది..**

ఎంత మంచి కార్యక్రమమైనా ప్రజల సహకారం లేకుండా పూర్తి ఫలితాలను ఇవ్వదు. గంజాయి నిర్మూలనలో కుటుంబాలు, ఉపాధ్యాయులు, యువత భాగస్వామ్యం అవసరమైనట్లే.. మహిళల భద్రతలో కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కూడా బాధ్యతను పంచుకోవాల్సి ఉంటుంది. పోలీసు శాఖ చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ప్రజల సహకారంతోనే మరింత విస్తృత ప్రభావాన్ని చూపగలవు. 'చైతన్యం' ద్వారా యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడే ప్రయత్నం, 'పోలీస్ అక్క' ద్వారా మహిళలు, బాలికలకు భరోసా కల్పించే ప్రయత్నం రెండూ వేర్వేరు కార్యక్రమాలైనా.. వాటి అంతర్లీన లక్ష్యం మాత్రం ఒక్కటే. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే.. సమస్యకు కారణాలను ముందుగానే గుర్తించి నివారించడం. ప్రజలతో కలిసి పనిచేస్తూ భద్రత, అవగాహన, బాధ్యత అనే మూడు అంశాలను సమన్వయం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు చేపడుతున్న 'చైతన్యం', 'పోలీస్ అక్క' కార్యక్రమాలు ప్రజా భాగస్వామ్య పోలీసింగ్‌కు ఒక ప్రత్యేక దిశను చూపుతున్నాయి.

## శిక్షించే పోలీసింగ్ నుంచి భాగస్వామ్య పోలీసింగ్ వైపు..

ఈ రెండు కార్యక్రమాలను పరిశీలిస్తే పోలీసింగ్‌లో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. పోలీసింగ్ అంటే కేవలం నేరస్థులను పట్టుకోవడమే కాదు.. నేరాలు జరగకుండా సమాజాన్ని సిద్ధం చేయడం కూడా అంతే ముఖ్యమనే భావన వీటి వెనుక ఉంది. ఒకవైపు మత్తు పదార్థాలపై యువతను అప్రమత్తం చేస్తూ వారి భవిష్యత్తును కాపాడే ప్రయత్నం.. మరోవైపు మహిళలకు ధైర్యం, భరోసా కల్పిస్తూ భద్రతా వాతావరణాన్ని బలోపేతం చేసే ప్రయత్నం. ప్రజలతో దూరంగా ఉండే పోలీసింగ్ కంటే ప్రజల మధ్య ఉండే పోలీసింగ్ మరింత ఫలితాలను ఇవ్వగలదనే ఆలోచనకు ఈ రెండు కార్యక్రమాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం
- అడవితో బతుకు.. ప్రకృతితో అనుబంధం
- తరతరాల జ్ఞానమే ఆదివాసీ సమాజానికి అసలైన సంపద
- అభివృద్ధి అడుగులు పడుతున్నా.. కొన్ని గూడాలకు అందని కనీస సదుపాయాలు
- కొత్త తరం కొత్త ప్రపంచంలోకి.. మూలాలను కాపాడుకోవడమే సవాల్
- భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే అస్తిత్వానికి పునాది
- ఆదివాసీ మహిళల చేతుల్లో ఆరోగ్యం, జీవన జ్ఞాన వారసత్వం
- "మంత్రసానుల సంప్రదాయ జ్ఞానానికి గౌరవం.. జీవితం, శ్రేయస్సు పరిరక్షణే" 2026 ఐక్యరాజ్యసమితి అంశం



# అడవే ఆస్తి.. సంస్కృతే శ్వాస..!

**అడవి వారికి కేవలం నివాసం కాదు.. ఆస్తి. మట్టి వారికి కేవలం నేల కాదు.. తరతరాల జ్ఞాపకం. చెట్టు వారికి కేవలం వనరు కాదు.. జీవనంలో ఒక భాగం. ప్రకృతితో సహజీవనం చేస్తూ ప్రత్యేకమైన జీవన విధానాన్ని నిర్మించుకున్న ఆదివాసీ సమాజం ఇప్పుడు మారుతున్న కాలంతో పాటు కొత్త ప్రపంచంలోకి అడుగులు వేస్తోంది. విద్య, వైద్యం, రహదారులు, సాంకేతికత, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న కొద్దీ జీవనశైలిలో మార్పులు వస్తున్నాయి. అదే సమయంలో భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో అనుబంధం, తరతరాల జ్ఞానం భవిష్యత్ తరాలకు ఎంతవరకు చేరుతాయన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 9న జరుపుకునే ప్రపంచ ఆదివాసీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదు.. వారి అస్తిత్వాన్ని గుర్తుచేసుకునే సందర్భం కూడా. భద్రాద్రి అడవులతో తరతరాలుగా ముడిపడిన కోయ, గుత్తికోయ, కొండరెడ్డి తదితర ఆదివాసీ సమాజాల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలే ఈ కథనానికి ప్రధాన నేపథ్యం.**

- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజా జ్యోతి (మాలోత్ అశోక్)

**అడవితో ముడిపడిన బతుకు..**

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో షెడ్యూల్డ్ తెగల జనాభా 36.66 శాతం. ఇందులో కోయ, గోండు, కొండరెడ్డి, గుత్తికోయ తదితర ఆదివాసీ తెగలతో పాటు లంబాడీలు కూడా అధికారిక షెడ్యూల్డ్ తెగల గణాంకాల్లో భాగంగా ఉన్నారు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అడవులతో ముడిపడిన ఆదివాసీ జీవనంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఇక్కడి అడవులు, కొండలు, వాగులు, సహజ వనరులతో అనేక కుటుంబాల జీవితం ముడిపడి ఉంది. అడవిలో లభించే వనరులు, స్థానిక ఆహారపు అలవాట్లు, ప్రకృతి ఆధారిత జీవన పద్ధతులు వారి జీవితంలో భాగమయ్యాయి. ఏ కాలంలో ఏ వనరు లభిస్తుంది.. ఏ మొక్కకు ఏ ఉపయోగం ఉంది.. ప్రకృతిలో వచ్చే మార్పులను ఎలా గుర్తించాలి.. వంటి ఎన్నో విషయాలు అనుభవం ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి చేరిన జ్ఞానం. ఇదే వారి విలువైన సంపద.

**కొత్త తరం.. కొత్త ప్రపంచం**

అయితే ఇప్పుడు కొత్త తరం వచ్చింది. ఇది ఇంటర్నెట్ యుగం. కొత్త తరం ఉన్నత విద్య, ఉద్యోగాలు, పట్టణ జీవితం వైపు అడుగులు వేస్తోంది. ఈ మార్పు అవసరమే.

విద్య, వైద్యం, ఉపాధి, సాంకేతికత నుంచి ఆదివాసీ సమాజం దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ కొత్తదాన్ని స్వీకరిస్తూనే తమ మూలాలను ఎలా కాపాడుకోవాలన్నదే అసలు సవాల్. భాష, యాస, జానపద గీతాలు, కళలు, ఆచారాలు, పండుగలు, సంప్రదాయాలు, ప్రకృతితో అనుబంధం బలహీనపడితే ఒక సమాజపు ప్రత్యేక గుర్తింపు కూడా మసకబారుతుంది. కొత్త తరానికి ఆధునిక విద్యతో పాటు తమ మూలాలు, సంస్కృతి, జీవన జ్ఞానంపై అవగాహన కల్పించడం చాలా అవసరం.

**ఆదివాసీ మహిళ.. జ్ఞానానికి వారధి**

ఒక తరం నుంచి మరో తరానికి జీవన జ్ఞానం చేరడంలో ఆదివాసీ మహిళల పాత్ర ప్రత్యేకమైనది. ఆహారపు అలవాట్ల నుంచి కుటుంబ సంరక్షణ వరకు.. ఆరోగ్య పరిజ్ఞానం నుంచి సంప్రదాయాల వరకు ఎన్నో విషయాలు కుటుంబ వ్యవస్థలోనే వారి ద్వారా తరతరాలకు చేరుతున్నాయి. 2026 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి “ఆదివాసీ మంత్రసానుల పాత్రను గౌరవించడం.. జీవితం మరియు శ్రేయస్సును కాపాడటం” అనే అంశాన్ని ముందుకు తెచ్చింది.

తరతరాలుగా వస్తున్న ఆదివాసీ ఆరోగ్య, సంరక్షణ, సాంస్కృతిక జ్ఞానాన్ని గుర్తించడం, పరిరక్షించడం దీని ప్రధాన ఉద్దేశం. ఆదివాసీ మంత్రసానుల సంప్రదాయ జ్ఞానం, వారి సేవలు, సమాజంలో వారి పాత్రకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాల్సిన అవసరాన్ని ఇది చాటుతోంది.

**అభివృద్ధితో పాటు.. అస్తిత్వం**

ఆదివాసీ సమాజానికి మంచి విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా వంటి సదుపాయాలు అవసరం. అయితే అభివృద్ధి వారి మూలాలను దెబ్బతీయకూడదు.

వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి రూపుదిద్దుకోవాలి. స్థానిక జ్ఞానాన్ని తక్కువగా చూడకుండా ఆధునిక విజ్ఞానంతో అనుసంధానం చేయాలి. ఆదివాసీ జీవన విధానంలో అడవి ఒక వనరు మాత్రమే కాదు. అది ఆహారం, ఉపాధి, ఔషధం, సంస్కృతి, జ్ఞాపకం, ఆత్మగౌరవంతో ముడిపడిన ప్రపంచం. అందుకే అడవుల పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం కాదు.. ఆదివాసీ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత కూడా.

ఆదివాసీ దినోత్సవం అంటే ఒకరోజు వేడుకలు నిర్వహించడం మాత్రమే కాదు. ఒక సమాజం దగ్గర ఉన్న జ్ఞానం రేపటి తరానికి ఎలా చేరాలి? అభివృద్ధి అందుతూనే వారి అస్తిత్వం ఎలా నిలవాలి? అడవి, జీవితం, సంస్కృతి మధ్య ఉన్న బంధాన్ని ఎలా కాపాడాలి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన రోజు.

## కొన్ని గూడాలు ఇప్పటికీ చీకటిలోనే..!

గిరిజన జిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంతో పోలిస్తే కాలం చాలావరకు మారింది. రహదారులు వచ్చాయి. విద్యాసంస్థలు పెరిగాయి. సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. కొత్త తరం చదువుకుంటోంది. అయితే అభివృద్ధి అన్ని ప్రాంతాలకు ఒకే వేగంతో చేరిందా అన్నదే ప్రశ్న. జిల్లాలోని కొన్ని ఆదివాసీ గూడాల్లో ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాల కొరత కనిపిస్తోంది. రహదారి, తాగునీరు, విద్యుత్, వైద్యం, రవాణా వంటి అవసరాల విషయంలో కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో బయట ప్రపంచంతో అనుసంధానం కావడం కూడా సవాలుగా మారుతోంది. అభివృద్ధి అంటే పట్టణాలకు రోడ్లు, భవనాలు చేరడం మాత్రమే కాదు. చివరి గూడాలో నివసించే కుటుంబానికి కూడా ప్రాథమిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పుడే అభివృద్ధికి పూర్తి అర్థం ఉంటుంది.